# THE
# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES
## OFFICIAL REPORT

---

Forty - third day of the Second Session of the Andhra Pradesh Legislative Assembly

---

## ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY
Thursday the 29th August, 1972

The House met at Half-past-Eight of the Clock.

(Mr. Deputy Speaker Sri C. Jagannadha Rao in the Chair)

## CONDOLENCE MOTION

*re:* DEMISE OF SRI V. R. G. K. M. PRASAD, M.L.A.

Mr. Deputy Speaker :—I regret to announce that Sri V. R. G. K.M. Prasad, a member of this House from Jaggayapeta Constituency has expired due to heart attack at Madras. I request the Leader of the House to move the Condolence Motion.

The Chief Minister (Sri P. V. Narasimha Rao) :—I beg to move :

"This House places on record its deep sense of sorrow at the demise of Sri V. R. G. K. M. Prasad, Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family."

Mr. Deputy Speaker :—Motion moved :

శ్రీ పి .వి నరసింహారావు :—అధ్యక్షా, యీ రోజు ఉదయం ఒక దుఃఖకరమయిన వార్త విన్నాము. చాలా విచారకరమయిన విషయం మూడు నాలుగు రోజులలో వారి కుమార్తె వివాహము చేయడానికి ఏర్పాటు చేశారు. మనలకందరకూ ఆహ్వాన పత్రికలు కూడా పంపించారు. ఇటువంటి పరిస్థితులలో వారి హటాత్ మరణం వారి కుటుంబానికి తీరని దుఃఖ పరిస్థితి కలిగించింది. ముత్యాలరాజాగా పాప్యులరుగా ఉన్న ప్రసాదుగారు యీ సభకు మొదట ఎన్నికయారు. అంతకుపూర్వంనుంచికూడ వారు చాలాకాలంగా ప్రజాసేవ చేస్తూనే ఉన్నారు. ఈ రోజు నాగార్జునసాగరు మన తెలుగువారికి రావడానికి కృషిచేసిన తెలుగువారిలో ప్రముఖపాత్ర వహించారు. నాగార్జునసాగరు రావడానికి కృషి చేసిన వారిలో ప్రముఖపాత్ర వహించారని కాకాని వెంకటరత్నంగారి లాంటి పెద్దలు శలవిచ్చారు. ప్రసాదుగారు ఆయుర్వేద అభిమాని. ఆర్ష రసాయనశాల అనే ఔషధాలు తయారుచేసే సంస్థను స్థాపించి సేవచేశారు. శాస్త్రీయ పద్ధతులలో ఔషధాలను తయారుచేయడంలో ప్రోత్సహించిన వారిలో ముత్యాలరాజుగారు ఒకరు. వారు రెండుసారులు పంచాయితి సమితి అధ్యక్షులుగా

ఎన్నికయారు. ఈ హోదాలో వారు ప్రజలకు ఎనలేని సేవచేశారు. వారు ప్రతి గ్రామానికి అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటుచేసి సేవచేశారు ప్రజలు ప్రతి గ్రామంలోనూ వారి పేరును గొప్పగా చెప్పుకుని గౌరవిస్తున్నారు. నాకు వారితో వ్యక్తిగతంగా ఎక్కువగా పరిచయం లేదు. వారు నావద్దకు నాలు గయిదు మారులు వచ్చారు వారిని చూచిన వెంటనే నాకు వారు ఒక గొప్ప సంస్కారవంతులనే అభిప్రాయం కలిగింది. వారి భాషలో ఎంతో మార్దవం వారిలో ఎంతో సంస్కారం ఉట్టిపడుతూ ఉండేది. ఇటువంటి సున్నిత భావాలు కలిగిన మహా వ్యక్తిని యీ సభ కోల్పోయింది. వారు ఎన్నికఅయి ఆరు మాసాలయినది వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని వారి కుటుంబానికి మన గాఢ సంతాపాన్ని తెలియచేయాలని మనవిచేస్తూ యీ తీర్మానాన్ని ప్రవేశపెడు తున్నాను.

శ్రీ వి. శ్రీకృష్ణ (మంగళగిరి) :—అధ్యక్షా, ప్రసాదుగారు యీ శాసన సభకు ఎన్ని అయినారు. వారు నిరాడంబర జీవి. సభానాయకులు చెప్పినట్లుగా నాగార్జున సాగరుకు ఆందోళన జరిగిన సమయంలో చాలా పెద్ద ఉద్యమం జరిగిన సందర్భంలో ఆయన ఆ ఉద్యమంలో ప్రముఖమయిన పాత్ర వహించారు. ఆ ఉద్య మంలో ముందుగా ఉండి కష్టనష్టాలు అన్ని భరించారు. ఆయన వస్తుతహా ముక్త్యాల జమీందారు అయినప్పటికి అనేక ప్రజా కార్యక్రమాలు విషయంలో ఎంతో సహకరించారు. ఆయన శాసనసభ్యులు అయినప్పటికి ఆయన ఆడంబరంగా కనిపించే వ్యక్తిగా లేరు చాలా నిరాడంబరమయిన వ్యక్తి. మూడవ తేదీన వారి కుమార్తె వివాహము మద్రాసులో చేయాలని వారు మద్రాసు వెళ్ళారు. వివాహముకు రావాలని చాలామందికి చెప్పారు. ఇటువంటి పరిస్థితిలో వారి అకాలమరణం చాలా శోచనీయంగానూ బాధగానూ ఉంది. ఆయన చాలా ఉద్యమాలలో ప్రముఖపాత్ర వహించారు జమీందారులలో ఇటువంటి వ్యక్తులు బహుకొద్దిమంది మాత్రమే ఉంటారు. జమీందారులలో ఇటువంటివారు మన శాసనసభలో సభ్యులుగా ఆరుమాసాలు మాత్రమే ఉండి మరణించడం విచారకర మయిన విషయం. వారి మరణానికి మా గాఢ సంతాపాన్ని తెలియచేస్తూ సభా నాయకులు ప్రవేశపెట్టిన యీ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ టి. పురుషోత్తమరావు (వర్ధన్నపేట) :—అధ్యక్షా, ప్రసాదుగారి మరణం నమ్మశక్యంకాకుండా ఉంది వారి బిడ్డ వివాహము మూడవతేదీన జరుగ వలసిన సమయంలో వారి మరణం ఎవరికయినా బాధ కలిగిస్తుంది. వారితో నాకు పెద్దగా పరిచయం లేదు. కాని రెండు మూడు దఫాలు వారిని చూచాను సభానాయకులు చెప్పినట్లుగా వారి వినయం సంస్కారముల విషయంలో ప్రతి ఒక్కరూ ఒప్పుకోవాలి. ఇటువంటి పరిస్థితులలో వారి మరణం హృదయవిదార కంగా ఉంది. వారి అకాల మరణానికి మా సంతాపాన్ని తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి కలుగచేయాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి మా సంతా పాన్ని తెలియచేయాలని కోరుతూ సభానాయకులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ వసంత నాగేశ్వరరావు (నందిగామ) :—అధ్యక్షా, ముక్త్యాలరాజా గారు నేను ఒకే తాలూకానుంచి యెన్నిక అయినవారము ఇంత కొద్దికాలంలోనే ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని మనము చెప్పుకోవలసిన యీ దుఃఖ ఘడియలు వస్తాయని, యీ దుర్దినం వస్తుందని నేను కాని మా తాలూకాలోని ప్రజలుకాని ఊహించలేదు. రాజాగారితో వ్యక్తిగతంగా నాకు చాలా సంబంధం ఉంది. ఆయన ఇండిపెండెంట్‌గా యెన్నిక అయినప్పటికి ఆయన యెంతో ప్రేమతో మా అందరితో కలిసిమెలసి ఉండేవారు. ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా ఆయన మా తాలూకాలో చేసినటువంటి సేవ అపారమైనటువంటిది. సమితి ప్రసిడెంటుగా ఆ ప్రాంతమును బాగుచేయడం, సమితి అధ్యక్షపదవినుంచి దిగిపోయిన తర్వాతకూడా అనేక కార్యక్రమాలలో పాల్గొని, దీర్ఘకాలికమైనటువంటి వ్యాధులకు పెద్ద పెద్ద సెంటర్స్ పెట్టి ప్రజాసేవ చేసేవారు. ఆర్షరసాయనశాల పేరుతో ఆయన ప్రతి వారికి అక్కడ ఉన్న ప్రతి చిన్నజబ్బులకు కాని యీనాడు పేరుపొందినటువంటి చాలా పెద్ద మందుల దగ్గర నుంచి కూడా ఆ ముక్త్యాలలో తయారైనవి ప్రసిద్ధమైనటువంటివి ఆయన చాలా జాగ్రత్తగా చేస్తూ ఉండేవారు. ఆయన చాలా నిరాడంబరంగా ఉండేవారు ఆయన మూడురోజుల క్రిందట నన్ను కలిసినప్పుడు —ఇది నేను చేసేటటువంటి చివరిపెళ్ళి ఘనంగా చేయదలచాను ప్రతివారికి శుభ లేఖలు యిమ్మన్నప్పుడు నేను సరేనని అన్నాను. నేను రాత్రి 8 గంటలకు ట్రంకాల్ చేసినప్పుడు చాలా సీరియస్‌గా ఉందని అన్నారు తిరిగి ఉదయం చేరే టప్పటికి యీ దుఃఖ వార్త విని చాలా బాధపడ్డాను. ఆయన మరణం మా తాలూకా ప్రజలకు తీరని లోటు. ఆయన నాగార్జునసాగర్ అనేది లేకుండా నందికొండ అన్నప్పుడు చాలామంది నందికొండ పందికొండ అని హేళన చేయగా మాట్లాడిన రోజులలో ఆయనకు వచ్చినటువంటి కాంపెన్‌సేషన్ మొత్తాన్నికూడా కమటీ వచ్చిన సందర్భంలో ఊరూరా సభలు పెట్టించి బ్రహ్మాండమైన ఆందోళన జరిపి యీ నాగార్జునసాగర్ ఆంధ్రదేశానికి నాగార్జునసాగర్ నిర్మాత అని పేరు తెచ్చుకోవడానికి ప్రథమ కారకులు అయ్యారు. ఆయన వత్తిడివల్లనే త్రివేదీగారి కలముపోటుతో ఆ నాడు నాగార్జునసాగర్ రావడం జరిగింది. అది మనందరికి తెలిసినటువంటిదే కాబట్టి ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ ఆయన కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలియజేస్తూ మా తాలూకా ప్రజల ద్వారా ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ ఎమ్ ఓంకార్ (నరసంపేట) :—అధ్యక్షా, మొదటిసారిగా యీ శాసన సభకు వచ్చినప్పుడు మేము అంతా కొత్తవారమే కాబట్టి యే రకంగా మెదులు కోవాలనే విషయములన్నీ రాజాగారు మేము మాట్లాడుకోవడం జరిగింది. వారి యొక్క ప్రవర్తన, పూర్వచరిత్ర గురించి ముఖ్యమంత్రిగారు వివరించారు ఆయన జాతీయ అభిమాని, ఉదారస్వభావము కలవారు అన్నది స్పష్టమైన విషయం. ఆయన ప్రజలయొక్క విశ్వాసాన్ని చూరగొన్నవారు అభ్యుదయ కాముకులు. కాబట్టి యీసారి జనరల్ యెన్నికలలో మా పార్టీకూడా వారిని బలపర్చడం జరిగింది. ఏమైనప్పటికి నాలుగు కాలాలపాటు ఉండి ప్రజలకు సేవచేయకుండా

విధి మన నుంచి వారిని వేరుచేసింది ముఖ్యంగా తన కూతురుయొక్క వివాహ శుభ:మయాన్ని తన కళ్ళారా చూడకుండా ఆయనను తీసుకుపోవడం అనేది చాలా హృదయవిదారకరమైనది. చాలా బాధతో వారి మరణంపట్ల వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తున్నాను.

శ్రీ ఎన్. వెంకటరత్నం (గుంటూరు-2) :—అధ్యక్షా, మిత్రులు ప్రసాద్ గారితో స్వల్ప పరిచయం అయినప్పటికి వారు మా మనస్సుమీద ఒక తీరని, చెరగని ముద్రవేశారు. జమీందారు అనగానే మనకు మొదట వారు సంఘ శత్రువులు అనిపిస్తూ ఉంటుంది. వీరి విషయంలో వారు సంఘ మిత్రులు, సంఘ సేవికులే. జమీందాకి ఎబాలిషన్ యాక్ట్ వచ్చినప్పుడు కూడా యీ జమీందారీకి కాంపెన్ సేషన్ యివ్వనక్కరలేదని మొదటిసారిగా వాదించినవాడినని, కాంపెన్సేషన్ యిచ్చారు కాబట్టి అందులో ఒక్కరూపాయికూడా నా క్రింద ఖర్చుచేసుకోకుండా యీ నందికొండ ప్రాజక్టు విషయంలో ఆ చివరి రూపాయి ఖర్చుపెట్టినానని శ్రీ కె.ఎల్ రావుగారు, తీవ్రంగా కృషిచేసినటువంటి కమ్యూనిస్టుల అండతో యీ నందికొండ ప్రాజక్టును సాధించానని మిత్రులు రాజాగారు చెబుతూ ఉండేవారు మన సభానాయకులు అన్నట్లుగా ప్రసాద్‌గారు అంతటి ఉత్తమ సంస్కారిని మనము చూడడం కష్టం లోతైన భావాలు కలవారు అనవసరంగా ఒక్క మాట అయినా యెక్కువగా మాట్లాడేవారు కాదు మొన్న లాండ్ సీలింగ్ మీద చాలా మధురమైన స్పీచ్‌లు వారు యిచ్చారు. అందులో వారు జమీందారీ చట్టంలో పోగొట్టుకున్నవాడిని, తర్వాత వచ్చిన సంస్కరణల వల్ల చాలా పోగొట్టు కున్నవాడిని మరల సీలింగ్ క్రింద మరికొంత పోగొట్టుకున్నవాడిని అయ్యాను అని ఆయన హాస్యధోరణిలో చెప్పినప్పటికి పాపం ఆయన యిప్పుడు తన్నుతానే పోగొట్టు కున్నారు. తన కుమార్తె వివాహం దగ్గరకు వచ్చిన సందర్భంలో ఆయన యెంతో అప్యాయంగా దూరం అయినప్పటికి అందరూ వచ్చినట్లయితే చాలా సంతోషిస్తానని ఆహ్వానించిన మనిషి పాపం తానే చూడకుండా యీ లోకాన్ని విడిచిపోయిన యిటువంటి సంస్కర్తను మనము పోగొట్టుకొనడం చాలా దురదృష్టకరం మా పీపుల్స్ డెమోక్రాటిక్స్ తరఫున యీ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి కుటుంబానికి సంతాపాన్ని అందజేస్తున్నాము.

వ్యవసాయ శాఖమంత్రి (శ్రీ కాకాని వెంకటరత్నం) :—ముత్యాలరాజా గారి మరణం రాత్రి 12 గంటలకు తెలిసింది. ఆయన కుటుంబం అంతా కూడా మద్రాసులోనే ఉన్నారు ఆయన తన కుమార్తె వివాహం నిర్ణయించుకొని ఇక్కడ నుంచి మద్రాసుకు వెళ్ళారు. ఆయన చేసిన ఘనకార్యం ఏమిటంటే ఖోస్లా కమిటీ వచ్చినప్పుడు కృష్ణా పెన్నార్ వ్యవహారంలో యిక్కడ నుంచి అక్కడికి ఈ నీరు తరలించుకుపోతున్నారనే దానిమీద ఆవేదనపడి ఆ రోజుల్లో మోటూరు సత్యనారాయణగారి చేత యెన్నో ఆర్టికిల్స్ వ్రాయించేవారు. ఖోస్లా కమిటీ వచ్చినప్పుడు చెట్లు అన్నింటిమీద వాల్ పోస్టులు వేయించి ప్రజలందరికీ తెలిసేటట్లుగా అటు గుంటూరు వైపున ఇటు హైదరాబాదు వైపు

అన్ని చోట్ల కూడా అంటించి అట్లాచేసి కృష్ణాపెన్నారును ఆని మనము ఆ నాడు నందికొండ అనుకునేటటువంటి ఈ నాగార్జునసాగర్ మనకు రావడానికి యెంతో సహాయపడ్డారు ఆయన యెన్నో వైద్యశాలలు కట్టించారు ఈ మధ్య కేన్సర్ వ్యాధి చికిత్సకొరకు ఒక హాస్పిటల్ స్థాపించి కొంత మందిని చేర్చి యెంతో ప్రయత్నం చేశారు కాని సఫలీకృతులు కాలేదు మొత్తం మీద ఆయనకు దానధర్మాలు, ఈ ఆయుర్వేద వైద్యం వారి తండ్రిగారి టైము నుంచి వస్తూనే ఉంది, దానిని యిప్పటివరకు వీరు పోషించుకుంటూనే వచ్చారు ఆయన పంచాయితీ సమితి అధ్యక్షులుగా ఉండి ఆ గ్రామాలకు కావలసిన సౌకర్యాలు అన్నీ చేస్తూనే ఉండేవారు వీరు మొట్టమొదట కాంగ్రెసువాదిగానే ఉండేవారు అయ్యదేవర కాళేశ్వరరావుగారి టైములో కాంగ్రెసువాదిగా ఉంటూ వచ్చారు దురదృష్టవశాత్తు ఈ మధ్యన ఎన్నికలలో ఆయన కాంగ్రెసుకు యెదురుతిరిగి పోటీగా నిలబడినారు కాని వారు మొట్టమొదట కాంగ్రెసువాదే. ఇటువంటి ముత్యాలరాజాగారు ఈ నాడు ఆరు మాసములు కాకముందే దివంగతులు అవడం ఈ సభకు తీరని లోటు అని ఆయన కుటుంబానికి వారి బంధువులకు సంతాపాన్ని తెలియపరుస్తూ నాయకులు చేసిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను

శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసుల్ రెడ్డి (గూడూరు) :— అధ్యక్షా, ఉదయం రేడియోలో ఈ దుర్వార్త వినడం జరిగింది వారు చాల నిరాడంబర వ్యక్తి మహోన్నతమైనటు మంచి ఆశయాలు కలిగినటువంటి వ్యక్తి తొణకకుండా బెణకకుండా సౌజన్యమూర్తిగా కనబడే వ్యక్తి. ప్రతిపక్షంలో మా సరసన కూర్చున్న వ్యక్తి. ఆయన అనుకోకుండా అనూహితంగా కాల గర్భంలో కలిసి పోయినాడు అంటే అందరం కూడా చింతించవలసిన విషయం. రాజుగాని రాజు ముత్యాల రాజా జమీందారుగాని జమీందారు ముత్యాల రాజా వారి పేరు ప్రసాదు అంటే ఈ నాటి వరకూ ఎవరికి తెలియదు. ముత్యాలరాజాగానే అందరికి తెలుసు అహంభావం ఎరుగని నిరాడంబర జీవిగా, నిగర్విగా జీవించిన వ్యక్తి రాజాగారు అటువంటి వ్యక్తిని ఈ నాడు ఆంధ్రదేశం కోల్పోయింది అంటే ప్రతి ఒకరూ చింతించవలసిన విషయం. ప్రతిపక్షం పలుచబడిపోతుండే ఈ రోజుల్లో ప్రతిపక్షం నామరూపాలు లేకుండా చేయాలని ప్రయత్నాలు జరిగే ఈ రోజుల్లో ప్రతిపక్షంలో ఉన్న అతి ముఖ్యుడైన ఒక సభ్యుడు అనువులు కోల్పోయినాడంటే ప్రతిపక్ష సభ్యులుగా మేము ఎంతో చింతిస్తున్నాం. సోషలిస్టు డెమోక్రటిక్ ఫ్రంటు తరపున వారి మరణానికి గాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలి అని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ సి వి. కె. రావు (కాకినాడ) :—అధ్యక్షా, ఈ శాసనసభలో మన సహచరుడుగా ఉండి ఇక్కడ తాను బహు కొద్ది మందితో పరిచయం ఏర్పాటు చేసుకున్నప్పటికి బహు సౌమ్యవ్యక్తిగా ఉన్నటువంటి శ్రీ ప్రసాద్ గారి మరణానికి నా సహచరులతోపాటు నేను గూడా గాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నాను. ధనిక

వర్గానికి చెందినప్పటికి కూడా ఆయన చిన్న వయస్సులో స్వతంత్ర్య ఉద్యమంలో చేరడానికి సాహసించిన మనిషిగా నేను తెలుసుకున్నాను. కృష్ణా జిల్లాలో జమీందార్లు కాంగ్రెసు కష్టాల్లో ఉన్నపుడు కాంగ్రెసులో ఉన్నటువంటివారు కాదు. ఆ రోజుల్లో సహితం స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక ఐక్య సంఘటనగా ఉన్నటువంటి కాంగ్రెసులో ఒక జమీందారి కుటుంబానికిచెంది ఆయన అందులో కుటుంబంతో సహా పాల్గొన్న వ్యక్తిగా మనం ఈ నాడు తెలుసుకున్నాం. అట్లయితే ఎటువంటి రాజకీయాల మార్పులు ఉన్నాయో, ఈ మార్పులు ఉన్న కాలంలో అధికారంలో ఉన్న వర్గానికి యెదురుగా నిలబడి గెలవడానికి కూడా సాహసించడం ఒక బ్రహ్మాండమైన శక్తితో కూడిన వ్యవహారం. దీనిని సాధించి ఇక్కడ ప్రతిపక్షంలో ఉండి తాత్కాలికమైన ఎత్తుగడలకు కూడా లోను కాకుండా ఆయన ప్రతిపక్షంలో ఉండి తాను అతి సౌమ్యంగా ఈ శాసన సభలో పాల్గొనేటటువంటి వ్యక్తి మరణానికి నా సంతాపాన్ని మరొకసారి విన్న విస్తున్నాను నిజానికి వారు చాల మంచి చరిత్ర కలిగినటువంటి వ్యక్తి చాల విషయాలలో, సంస్కరణ విషయాలలోనేమి, రాజకీయాలలోనేమి, ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకొన్న విషయాలలోనేమి, శాస్త్రి పరిశోధనలో నేమి ముఖ్య మంత్రిగారు చెప్పినట్లు చాల ఉత్తమ సాంప్రదాయాలు కలిగినటువంటి వ్యక్తి. ఆయన వృద్ధుడుకాడు. అతి నిరాడంబరమైన వ్యక్తి, చాల ధైర్యసాహసాలు కలిగినటువంటి వ్యక్తి. అటువంటి సహచరుని కోల్పోవడం మన అందరకు చాల సంతాపకరమైన విషయం, ఈ సందర్భంలో ముఖ్యమంతిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంతో నేను ఏకీభవిస్తూ వారి కుటుంబానికి నా సహచరులతో బాటు నా సంతాపాన్ని ప్రకటిస్తున్నారు.

సాంఘిక, సంక్షేమ శాఖామాత్యులు (శ్రీ ఎమ్ వి. కృష్ణారావు) :— ముత్యాలరాజు పేరుకు రాజుగారు పుట్టింది రాజుగారి కుటుంబంలో అయినా ఆయనకు రాజా గార్కి ఉండే దర్పంగాని డాంభికంగాని ఆచార వ్యవహారాలుగాని వారికి ఉండేవి కాదు. సామాన్యమానవుడు లాగానే ఆయన సామాన్యమానవుడి శ్రేయస్సు కోసమే కృషిచేస్తూ వచ్చారు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో హరిజనులకు గిరిజనులకు బలహీనవర్గాలకు వారు అండగా ఉండే వారు చాలమందికి నివేశన స్థలాలు సమకూర్చిపెట్టారు నిజంగా వారు పేదలకు పెన్నిధి. పేద వారు పెళ్లిళ్లు చేసుకున్నప్పుడు వారు ఖర్చులు భరించలేరని వారందరినీ పిలిచి సామూహిక వివాహాలు చేసే వారు. నేను ఒక ఇంటర్ కాస్టు వివాహం జరిపిస్తాను మీరు తప్పని సరిగారావాలి అది వారు నాతో చెప్పారు కాని వారి ఆశయం నెరవేరకుండానే మన మధ్యనుంచి వారు వెళ్లిపోయారు. నాగార్జునసాగర్ వచ్చింది గానీ కృష్ణా డెల్టాకు ఈ నీరు పూర్తిగా లభ్యంకాదు పోచంపల్లి ప్రాజెక్టు వస్తేనే కృష్ణాడెల్టాకు నీరు లభ్యం అవుతుంది కాబట్టి పులిచింతల కోసం మనం ఆందోళన చేయాలని కూడా వారు నాతో చెప్పడం జరిగింది. దానికి వారు చాల ఇన్ఫర్మేషన్ ప్రోగు చేశారు. వారు ఎంతో సరళ హృదయులు. స్నేహశీలి. వారి కూమార్తె పెళ్లికి తన మిత్రులైన వారందరినీ స్వయంగా వెళ్లి పిలిచారు అసలు వారికి అలసట

రావడానికి ఇదే కారణం. తూర్పుగోదావరి దగ్గరనుంచి అన్ని ప్రాంతాలకు వారు స్వయంగా వెళ్లి వారి మిత్రులను ఆహ్వానించి తిరిగి వెళ్లడంలో మద్రాసు స్టేషన్ చేరక ముందే ఆయనకు కాళ్లు చేతులు లాగడం జరిగింది. వెంటనే నర్సింగు హోమ్‌కి తీసుకువెళ్ళారు అక్కడనే చివరికి ప్రాణాలు విడవడం జరిగింది, పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేసుకొని ఆ సమయంలో వారు పోవడం చాల దురదృష్టకరమైన విషయం వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబానికి మా హృదయ పూర్వక మైన సానుభూతిని అందజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సానుభూతి తీర్మానం హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను

శ్రీ ఎమ్ ఆర్. అప్పారావు (నూజివీడు) :— నిన్న గుంటూరులో మేము సిండికేటుమీటింగులో ఉండగా ఆయన బావమరిది అయిన రామకృష్ణప్రసాదుగారు అంటే చల్లపల్లిరాజాగారి సోదరుడు వారి పరిస్థితి చాల ప్రమాదంగా ఉందని 12 గంటలకు చెప్పారు ఏదో మామూలుగా హార్టు ఎటాకు వచ్చిందేమో అను కున్నాం. కాని ప్రొద్దున 6½ కు రేడియోవింటే వారు చనిపోయారని వార్త విని చాల విచారపడ్డాం, అన్ని రంగాలలో వారుఅపారమైన సేవచేశారు సారస్వత రంగంలోకూడ ఆయన చాలా సేవచేశారు. విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణాన్ని ఆయన అచ్చువేయించినారు. సమితి ప్రసిడెంటుగాకూడ ఆయన ఎంతో నిస్వార్థమైన ప్రజాసేవచేశారు. అన్నిటికంటే ముఖ్యంగా నాగార్జునసాగర్ విషయంలో పూర్వము ఎవరూ దాన్నిగురించి పట్టించుకోనప్పుడు, దానికి దారికూడ లేనప్పుడు ఆయన 50, 60 వేలు దాదాపు లక్షరూపాయలవరకు తనస్వంతడబ్బు తనకు కాంపెన్సేషన్ఇస్తే దానిని స్వంతానికి ఉపయోగించు కోనకుండా నాగార్జునసాగర్‌కు దారిచేయడంకొరకు వినియోగించారు. కె. ఎల్. రావుగారు వాటర్ అండు పవరు కమీషన్ చైర్మన్‌గా ఉండినప్పుడు ఆవిధంగా నాగార్జునసాగర్‌కు దారివేయడానికి స్వంతడబ్బు ఖర్చుపెట్టి చాలా కృషిచేశారు, ఇప్పుడు మనకు నాగార్జునసాగర్ వచ్చిందంటే ఆయనవల్లనే అని చెప్పాలి. దానికి వారు అపారమైనసేవ ఇంతా అంతా అని విలువకట్టలేనంతటి సేవచేశారు. ఆయనవయస్సుకూడ 51, 52 కంటె ఎక్కువలేదు. వారు మన చల్లపల్లి రాజాగారి బ్రదర్-ఇన్‌లా. అటువంటివారి అకాలమరణానికి వారి కుటుంబానికి చల్లపల్లి రాజాగారికి నాసానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతికలుగుగాకయని భగవంతుని ప్రార్థిస్తూ విరమిస్తున్నాను.

శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ (భోనగిరి) :—అధ్యక్షా, ఈ నాడు రేడియోలో ఈవార్త వింటూవుంటే చాలా ఆశ్చర్యం కలిగింది, ముక్త్యాల రాజాగారి కుటుంబానికీ మాకుటుంబానికి చాలా సన్నిహితమైన కుటుంబ సంబంధాలు ఉన్నాయి. వారి కుమారుడిద్వారా ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్ పెరిగింది. ఆఅబ్బాయి ఇటీవలవరకు మా యింటిలోనే ఉండేవాడు. ఈవిధంగా సన్నిహితంగా ముక్త్యాలరాజాగారి ఫ్యామిలీ విషయాలుకూడ కనుగొనే అవకాశము నాకుకలిగింది. వారు చాలామిత్రులు. వారి ప్రజాసేవగురించి ఇదివరకు మిత్రులుచెప్పినారు. ఫ్యూడల్ లార్డ్సుగాఉండి ప్రజాసానుభూతిని పొందినటువంటి

వారు చాలా కొద్దిమంది చరిత్రలో లభిస్తారు అటువంటివారిలో ముక్త్యాల రాజాగారు ఒకరనిచెప్పడంలో సందేహములేదు ప్రజలకు వారిపైన అపారమైనప్రేమ ఉండినది తక్కువ వయస్సులోనే వారు చనిపోయారు. అది సభ్యులందరికికూడ సంతాపము కలిగించడం సహజము అందులో వారి ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్ ఉన్నందువలన నాకు నా కుటుంబానికి చాలాసంతాపము కలిగింది ఈసందర్భంలో నేను సంతాపమును తెలుపుతూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి తీర్మానమును బలపరుస్తున్నాను

శ్రీ ఎ. భాస్కరరావు (కంకిపాడు) :—అధ్యక్షా, పేరు ప్రసాద్‌గారైనా ముక్త్యాలరాజాగారుగా చలామణి అయినారు సాహిత్యరంగములోను, కళా రంగములోను ఎక్కువ అభిరుచిని వారు వ్యక్తపరిచారు చాలా సౌమ్యులు. జిల్లాపరిషత్తులోకూడ వారు గణనీయమైన సేవచేశారు. పంచాయితీసమితిలో కూడ సుమారు పదిసంవత్సరాలు అధ్యక్షులుగాఉండి చాలా విశిష్టమైన సేవచేయడం జరిగింది ముఖ్యంగా రాష్ట్రమంతటికి ఉపయోగపడేటటువంటి నాగార్జునసాగర్ విషయంలో వారు చాలా పట్టుదలగా చేసినకృషి చరిత్రప్రసిద్ధమైనటువంటిది అనాడు కృష్ణా ఆయకట్టును రక్షించుకోడానికి పులిచింతల ప్రాజెక్టుకొరకు ఆందోళన జరుగుతున్న సమయంలో దీనికంటె నందికొండప్రాజెక్టు ఇంకా హెచ్చు రాష్ట్రానికి ఉపయోగపడుతుంది అనే అభిప్రాయము వచ్చినప్పుడు ఈ ప్రతిపాదనను ఆయన అలాగే అట్టిపెట్టుకొని నందికొండ ప్రాజెక్టుకోసం విశేషమైన కృషిచేశారు. "క్రిష్ణమ్మకు జే జే లు" అని వారు ప్రచురించినటువంటి పుస్తకము ఇప్పటికీవున్నది నిజానికి ఆరోజులలో నందికొండ ప్రాజెక్టుగురించిన వివరాలు చాలా తక్కువగా తెలుస్తూవుండేవి. వారు దాన్నిగురించి అనేక విషయాలు సేకరించారు పార్లమెంటు సభ్యులుగాఉండిన మోటూరు సత్యనారాయణగారితో సహచర్యలు జరిపి వీరిద్దరూ అప్పుడు కేంద్రప్రభుత్వములోను రాష్ట్రప్రభుత్వములోనుఉండే అనేకవిషయాలు సేకరించి ప్రజలకు ఎప్పటికప్పుడు వ్యాసరూపేణ తెలియ పరిచారు వారి కృషి ఫలితంగానే మనకు ఈనాడు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కూడ లభ్యమైంది. తరువాత క్రిష్ణాజిల్లాకు ఆవాటర్ ఇంతవరకు లభ్యము కాలేదనే ఆవేదనతో ఆయన ఉంటూఉండేవారు. ఆయన చాలా స్నేహశీలి, కళాప్రియుడు ఆయుర్వేద వైద్యములంటే ఆయనకు ఎక్కువప్రీతి. అటువంటి ప్రజాసేవ చేసినటువంటివారు ఇంతతక్కువ వయస్సులో కీర్తిశేషులు అవడం చాలా విచారకరము. అటువంటి స్నేహశీలి సౌమ్యులు అయినటువంటి శ్రీరాజాగారి అకాల మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని వారికుటుంబానికి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలుగుగాకయని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

**Sri Ch. Parasurama Naidu** (Parvathipuram) :—Mr. Deputy Speaker, Sir, Mr. Prasad was quite young, healthy and hale. His death was very unexpected and nobody could ever have expected that such a robust young gentleman would leave us soearly. I had

occasion to speak to him three or four times. The Chief Minister has very aptly described what a quiet gentleman he was He was lovable and amiable, a personality who endeared himself by mere contact. As regards the varied services rendered by him, they have been put forth by our friends who have known him personally in his long career of public service. We are now given to understaud that this gentleman was responsible for a great cause to succeed. And it is a pity that s.ch a gentleman should leave us and that too it has become a tragic thing when he was planning for a very auspicious performance. I associate myself with the Chief M nister in moving the resolution and wish that his soul rests in eternal peace.

శ్రీ కాజా రామనాథం (ముదినేపల్లి):— అధ్యక్షా! శ్రీ ప్రసాద్‌గారి మరణము చాలా అనుకోనుండా జరిగినటువంటి సంఘటన, చాలా మందిని ఆశ్చర్యచకితులను చేసింది. 2, 3 రోజుల క్రితము ఆయన ఎంతో ఆరోగ్యముగా ఉండి కూతురు పెండ్లికి రావలసిందని ఆహ్వానించడం జరుగగా, ఈనాడు వారు మరణించారు అంటే నమ్మడానికి వీలుకాలేదు. ఆయన చాలా మితభాషి, స్నేహశీలి, ప్రజలలో చాలా అభిమానం కలిగినటువంటి వ్యక్తి. ఆయనపట్ల ఆయన నియోజకవర్గములో వెనుకబడిన తరగతులవారందరూ కూడా ఎంతో ఆప్యాయముతో, అనురాగముతో చూస్తున్నారు అనే విషయము మొన్న ఎలెక్షన్సులో వ్యక్తమైంది ఆయన రాజకీయాలలో చాలా ప్రముఖంగా ఉంటూ అందరికి కూడ సన్నిహితంగా ఉంటూ తనవారు, ఎదుటివారు అనేది లేకుండా అందరితో కూడ సమానంగా ఉండేటటువంటి వ్యక్తి ఆయన కృష్ణాజిల్లాకు సంబంధించినంతవరకు అనేక విషయాలలో కలుగచేసుకొని పనిచేసివారు. ప్రత్యేకించి నాగార్జునసాగర్— అపుడు నందికొండ ప్రాజెక్టు-కొరకు వారు చాలా ప్రయత్నం చేయడం, స్వంత డబ్బు ఖర్చుపెట్టి దానికి తగినంత ప్రచారం, కేంద్రం నుంచి కె.యల్. రావుగారిని, ఇతరులను తీసుకువచ్చి వానిని సర్వే చేయించి దానికి సంబంధించిన విషయాలు ప్రజలముందుకు తేవటము వారివల్లనే సాధ్యమైనదన్న విషయం అందరికి తెలిసినదే. కాని నాగార్జునసాగర్ వచ్చినంత మాత్రమున అది కృష్ణాజిల్లా రైతులకు ఉపయోగపడలేదని, పులిచింతల కడితేగాని, దాని ఉపయోగం కృష్ణాడెల్టా ప్రజలకురాదని పులిచింతల ప్రాజెక్టు కొరకు వారు ఆదుర్దాపడుతూ దానికోసం కృషిచేసిన వ్యక్తి. వారు, వారి కుటుంబము సాహిత్యంలో, ఆయుర్వేద వైద్యంలో చాలా కృషిచేశారు. వారు ఒక ఆయుర్వేద ఆశ్రమం నడుపుతూ వచ్చారు. దానిలో ఎక్కడా లభ్యంకానటువంటి అనేకమైన మందులు తయారుచేయించి ఉంచటం అందరికి తెలిసినదే వారు ప్రజలతో చాలా సన్నిహిత సంబంధం కలిగి ప్రజల అభిమానం చూరగొన్న వ్యక్తి. ఆయనలేని లోటు కృష్ణాజిల్లాకే కాకుండా ఆంధ్రరాష్ట్రానికే చాలా కనబడుతుంది వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తూ సభా నాయకులు ప్రవేశపెట్టిన తీర్మానంతో ఏకీభవిస్తున్నాను.

శ్రీమతి డి. ఇందిర (తెనాలి):— అధ్యక్షా! ముక్త్యాల రాజాగారు చాలా నిరాడంబరులు. నిగర్వి. సామాన్యంగా జమీందారులలో, రాజాలలో అలాంటి ఉదారస్వభావులు ప్రజాభిమానం పొందిన వ్యక్తులు చాలా తక్కువమంది

ఉంటారు వారు ఒక పత్రికలో లాండ్ రిఫారమ్స్ గురించి ఆర్టికల్ వ్రాస్తూ వారి ఉద్దేశ్యాలు ఏమిటో చెబుతూ, మారుతున్న కాలంలో మనం కూడ మారాలని, దానిని అడ్డుకోవటం మంచిదికాదని, కొన్ని చిన్న చిన్న మార్పులు తీసుకు రావాలని తెల్పారు. వారు చాలా ఆధునిక భావాలు కలిగిన వ్యక్తి వారి కీర్తి చిరస్థాయిగా నిల్చిపోతుంది వారు 51 అంతకుముందు మద్రాసులో ఉంటూ ఉండేవారు ఆ రోజుల్లో ఆంధ్ర స్టూడెంట్స్ అసోసియేషన్‌కు వస్తూ వారి ఇబ్బందులు ఏమిటో, వారికి ఏమి కావాలో తెలుసుకొంటూ ఉండేవారు. వారికి రాజకీయాలలో, సాహిత్య విషయాలలో ఎన్నోపనులు ఉన్నప్పటికీ, స్టూడెంట్స్‌ను కలవటం, ఫిషరీస్ అసోసియేషన్స్ స్థాపించటం చేశారు అటువంటివారు ఈనాడు మన మధ్యలేకుండా పోవటం చింతించవలసిన విషయం వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీమతి డి. ఇ. ఎస్. ఆనందాబాయి (గన్నవరం):—అధ్యక్షా! ప్రసాద్ గారితో మాకు పరిచయం చాలా తక్కువ అయినా వారిలో చాలా నిరాడంబరత్వం నాకు గోచరమయినది. అయన ఎం. ఎల్. ఏ గా ఎన్నికై — ఎం ఎల్. ఏ. క్వార్టర్స్‌లో ఒక క్వార్టర్ ఎలాట్ చేయించుకోగా, మేము వారితో— మీకు క్వార్టర్స్ ఎందుకు, మీరు రాజాలు, మీకు మంచి భవనం ఉండి, మీరు అక్కడ ఉంటే ఇంకో ఎం. ఎల్. ఏ కు ఆ క్వార్టర్ దొరుకుతుందికదా అని అంటే అలా కాదు, మీ అందరితో కలిసి యీ ఐదేండ్లు గడపాలని ఉంది, నేను ఇంతవరకు జమిందారుగా ఉన్నాను, కాని యీనాడు నేను సోషలిజమ్‌తో అడ్‌జస్టు కావాలని కోరిక ఉండి, అందుచేత నేను ఇక్కడే ఉండాలని కోరుకొంటున్నాను— అని అన్నారు వారు క్రీడారంగాన్ని ఎంతో పోషించారు. వారు మంచి సాహిత్యవేత్త. వారికి ఒక పోస్టుగ్రాడ్యుయేట్ సెంటర్ జగ్గయ్య పేటలో పెట్టాలని ఒక సంకల్పం ఉన్నది. అది నెరవేరకమునుపే వారు మనందరిని విడిచివెళ్లటము ఎంతో విచారకరము. వారి మరణానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలుగుగాక అని ప్రార్థిసూ వారి కుటుంబానికి సానుభూతి తెలియజేసూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ డి. రామారావు (విజయవాడ-ఈస్టు):— అధ్యక్షా! మన ముక్త్యాల రాజాగారి మరణవార్త విని చాలా ఆశ్చర్యచకితుణ్ణి అయినాను. వారితో నాకు 7, 8 సం. ల నుంచి పరిచయం ఉండి. వారు అగర్భ శ్రీమంతుల బిడ్డ అయినా అగర్భ దరిద్రులను ప్రేమించి వారికి సేవ చేసి ప్రజాభిమానం చూరగొన్నారు వారు సాహిత్య ప్రియులు శ్రీ విశ్వనాధసత్యనారాయణగారి రామాయణాన్ని శ్రోతలుగా ఉండి విని-దానిని అచ్చువేయించారు. వారు చాలా ఉదారస్వభావులు. వారు నాకు మొన్న మద్రాసులో కనబడి తమ ఇంటికి వచ్చి ఆతిధ్యం తీసుకొమ్మని బలవంతం చేశారు. వారి తాహతుకు, మన తాహతుకు చాలా వ్యత్యాసం ఉన్నా, వారు సామాన్య మానవులను, మధ్యతరగతి చిన్నతరగతిప్రజలను ఎంతో

ఆదరాభిమానంతో చూసి ప్రజాసేవ చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కొరకు వారు చేసిన సేవ అసమాన్యమైనది. అటువంటి గొప్ప వ్యక్తి మరణించటం మన రాష్ట్రానికి తీరని లోటు వారి మరణానికి నేను చాలా బాధపడుతూ వారి కుటుంబానికి నాసానుభూతి తెలియజేస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీమతి జె ఈశ్వరీబాయి:— అధ్యక్షా! ముక్త్యాల రాజాగారి మరణం చాలా విచారకరమైన విషయము వారు ఎన్నికయివచ్చి 6 మాసాలు కూడ కాలేదు. వారు ఇండిపెండెంట్ గా ఎన్నికయి- అపోజిషన్ వారితోపాటు ఉండే వారు వారు పెద్ద జమిందారు అయినప్పటికి చాలా సింపుల్ గా ఉండేవారు. వారి ఆకస్మిక మరణం మన హౌవుస్ కు తీరనిలోటని చెబుతూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను నా పార్టీ తరఫున బలపరుస్తూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియజెస్తూ వారి ఆత్మకు శాంతి గలగాలని కోరుతున్నాను

శ్రీ కె. రంగదాస్ (కొల్లాపూర్):— అధ్యక్షా! సభా నా య కు లు ప్రవేసపెట్టిన సంతాప తీర్మానాన్ని మా గ్రూపు పక్షాన మేము బలపరుస్తూ వారి ఆత్మకు శాంతికలుగజేయాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ బి. వెంకటరెడ్డి (నంద్యాల):— అ ధ్య క్షా! ముక్త్యాల రాజాగారు నా వెనుకభాగంలో కూర్చొనేవారు. వారు ఇటీవలనే నాకు పరిచయం అయినారు వారి మరణవార్త విని నేను చాలా దుఃఖపడ్డాను వారినిగురించి గౌరవసభ్యులు చెప్పిన విషయాలతో నేను ఏకీభవిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి కు టు ం బా ని కి నా సానుభూతి తెలుపుచూ, వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలుగచేయాలని ప్రార్థిస్తూ సెలవుతీసుకొంటున్నాను.

శ్రీ జె. దామోదరరావు (బు గ్గా ర ం):—అధ్యక్షా, నేను ప్రసాద్ గారిని—వారు రాజాలని—కొద్దిరోజులక్రితమే తెలుసుకొనడం జరిగింది. ప్రతిపక్ష సభ్యులుగా ఒక రాజాగారు ఎన్నుకోబడి రావటం, వారు ఎటువంటి గుణములు, లక్షణములు, కలిగినవారో అనేదానికి ఒక ప్రత్యక్షనిదర్శనమని నేను భావిస్తున్నాను. వారు రాజాలైనా ప్రజారంజకులు ఉత్తములు. సోషలిస్టు భావాలు గలిగిన రాజా—అని తెలుసుకొన్నాను. అటువంటి నిరాడంబరులు ప్రతిపక్షానికి శిరోమణి అయినటువంటి ప్రసాద్ గారు మరణించడం చాలా విచారకరము వారి మరణము మా ప్రతిపక్షానికి తీరని లోటని భావిస్తున్నాను. వారి అకాలమరణానికి చింతిస్తు వారి ఆత్మకు శాంతి గలగాలని కోరుతూ, వారి కుటుంబానికి సానుభూతి తెలియ జేస్తున్నాను.

శ్రీ తిరుమలయ్య (వికారాబాద్):—అధ్యక్షా, ముక్త్యాల రాజాగారు వచ్చి ఆరు మాసములుకూడ కాలేదు. మనలనందరను విడిచిపెట్టి పోయినారంటే చాల విచారకరమైన మాట. ఆయన ఆత్మకు శాంతికలిగించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ విరమిస్తున్నాను.

శ్రీ బి బసప్ప (ఉరవకొండ) :—అధ్యక్షా, నేడు ముఖ్యమంత్రిగారు విచారకరమైన విషయాన్ని సభలో చెప్పినారు ముక్త్యాల రాజుగారితో నాకు ఎక్కువ పరిచయం లేదు ఇక్కడ అసెంబ్లీలోనే రెండు మూడు పర్యాయములు వారితో మాట్లాడినాను. వారు జమీందారీ కుటుంబంలో పుట్టినా వారు ఆదర్శవంతులు, ప్రజాసేవకులు. ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టినారు. ఎన్నో సాధించినారని పెద్దలు, ముఖ్యమంత్రిగారు చెప్పినారు. వారికి సన్నిహితంగా ఉండేవారు చెప్పిన దానినిబట్టి వారు ప్రజాసేవకులు అని బోధపడుతున్నది. ఆయన కుమార్తె వివాహం జరగబోయే సందర్భంలో దివంగతులు అయినారంటే ఆయన కుటుంబం ఎంత విలపిస్తున్నదో ? వారు పోవడం చాల విచారకరమైన విషయం. మిత్రులందరు చెప్పిన విషయాలతో ఏకీభవిస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తూ విరమిస్తున్నాను.

శ్రీ జి భూపతి (నేరెళ్ల) :—అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను ముక్త్యాల రాజుగారి కుటుంబానికి హరిజనుల తరపున మా తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ శెలవుతీసుకుంటున్నాను.

Mr. Deputy Speaker :—I fully aseociate mysslf with the sentiments expressed by the hon. Chief Minister and the other hon. Mem bers of this House.

It is a very sad thing that at this hour when he was about to celebrate the marriage of his daughter, Mr. V. R. G. K. M. Prasad, Raja of Muktyala should have died.

As a mark of respect, I request all of you to observe two minutes' silence.

(Pause)

The question is :

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri V. R. G. K. M. Parasad, a Member of the present Legislative Assembly and conveys its deep sense of sympathy to the members of the bereaved family.

The motion was adopted *n m con* all members standing.

Mr. Deputy Speaker:— The House stands adjourned to meet at 8-30 a.m. tomorrow.

(The House then adjourned till Half-past eight of the clock on Wednesday, the 30th August, 1972.)

———